సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 15 । సెప్టెంబర్ । 2025



ముగిసిన వెయిట్ లిఫ్టింగ్ టోర్నీ
ఖమ్మం పటేల్ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి మహిళల ఖేలో ఇండియా వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు ముగిశాయి. 8లో



కొనుగోళ్లలో కొత్త రూల్..
రైతులకే మద్దతు ధర దక్కేలా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పత్తి కొనుగోళ్లలో నిబంధనలు కఠినతరం చేస్తోంది. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 25°

వాతావరణం
జిల్లాలో సోమవారం ఉదయం అక్కడక్కడా జల్లులు పడవచ్చు. రోజంతా వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా నిత్యకల్యాణం


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామివారి నిత్యకల్యాణ వేడుక ఆదివారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి స్వామివారిని పల్లకీసేవగా చిత్రకూట మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. నిత్యకల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రామయ్య సేవలో ఎన్నికల కమిషనర్


రామాలయంలో కమిషనర్ ఐ.రాణి కుముదిని, తదితరులు

శ్రీసీతారామ చంద్రస్వామివారిని రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ ఐ.రాణి కుముదిని ఆదివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించారు. అనంతరం దేవస్థాన అనుబంధ ఆలయాలను సందర్శించగా అధికారులు స్వామివారి ప్రసాదం, జ్ఞాపికను అందజేశారు. ఆలయ ఈఓ దమోదర్‌రావు, ఏఈఓ శ్రవణ్‌కుమార్, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, పంచాయతీ ఈఓ శ్రీనివాసరావు, ఆర్‌ఐ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం, భద్రాచలంలో నేడు ప్రజావాణి

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో అత్యధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కొత్తగూడెం డివిజన్‌కు సంబంధించి కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయంలో, భద్రాచలం డివిజన్‌కు సంబంధించి భద్రాచలం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర సమస్యలు ఉన్నవారు కలెక్టరేట్‌లోని ఇన్‌వార్డ్ సెక్షన్‌లో తమ దరఖాస్తులను అందించి రశీదు పొందాలని, వాటిని సంబంధిత అధికారులకు పరిష్కారం నిమిత్తం పంపిస్తామని వివరించారు. కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం ఉండదని పేర్కొన్నారు.

భద్రాద్రితో విడదీయరాని బంధం

కవి సమ్మేళనంలో గజల్ శ్రీనివాస్

భద్రాచలంటౌన్: భద్రాచలానికి రామయ్య దర్శనంతోపాటు అనేక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చానని భద్రాద్రితో తనకు విడదీయరాని బంధం ఉందని ప్రముఖ గజల్ సింగర్, మాస్ట్రో గజల్ శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని తాతగుడి సెంటర్‌లో ఉన్న లైబ్రరీ హాల్‌లో ఆంధ్ర సారస్వత పరిషత్, భద్రాద్రి కవి గాయకుల ఆధ్వర్యంలో ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. సమ్మేళనానికి ఇరు రాష్ట్రాల నుంచి హాజరైన గాయకులు తమ గానాలతో అలరించారు. చివరిలో గజల్ శ్రీనివాస్ గజల్స్ గానం సంగీత ప్రియులను మైమరిపించింది. నిర్వాహకులు గాయకులను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. ఆంధ్ర సారస్వత పరిషత్ జిల్లా అధ్యక్షురాలు చిట్టే లలిత, పామరాజు తిరుమలరావు, కళాకారులు, గాయకులు, సంగీత ప్రియులు పాల్గొన్నారు.


కార్టూన్ పోటీలకు ఎంట్రీల ఆహ్వానం

ఖమ్మంగాంధీచౌక్ : వచ్చే ఏడాది జనవరిలో జరగనున్న ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో తెలుగు వికాసం శీర్షికతో కార్టూన్ పోటీలు నిర్వహించనున్నట్లు సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ. 5,116, ద్వితీయ బహుమతిగా రూ. 3,116, తృతీయ బహుమతి రూ. 2,116తో పాటు మూడు ప్రత్యేక నగదు బహుమతులు రూ. 516 చొప్పున, ప్రశంసాపత్రాలు అందిస్తామని వివరించారు. వయసుతో నిమిత్తం లేకుండా ఒక్కొక్కరు రెండు కార్టూన్లు పంపొచ్చని, ఏ4 సైజ్‌లో ఉండాలని, గతంలో ప్రచురితమైనవి పంపొద్దని సూచించారు. అక్టోబర్ 10 నాటికి నిర్వాహకులకు అందాలని, విజేతలను అక్టోబర్ 29న ప్రకటిస్తామని, తెలుగు మహాసభ సందర్భంగా నగదు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. కార్టూన్లను 98660 84124 వాట్సాప్ నంబర్‌కు పంపించాలని కోరారు.

కదనరంగంలో కొదమసింహాలై...

తెలంగాణ సాయుధ పోరాటం అనగానే దొడ్డి కొమురయ్య, షేక్ బందగీ, చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, భీంరెడ్డి నర్సింహారెడ్డి తదితర ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాలకు చెందిన పోరాట యోధులే గుర్తుకొస్తారు. ఆరోజుల్లో పల్లెల్లో అరాచక పాలనకు కేంద్రాలుగా ఉన్న దొరల గడీలు, వారికి మద్దతుగా నిలిచిన నైజాం సర్కార్, అతని క్రూరసైన్యంలో భాగమైన రజాకార్లకు వ్యతిరేకంగా ప్రజలను వారు ఏకం చేశారు. చేతిలో రాళ్లు, వడిసేల, గుత్ప(కర్రలు)లనే ఆయుధాలుగా చేసుకుని పోరాటం చేశారు. అయితే ఈ పోరాటంలో విప్లవకారులకు విల్లంబులు ఎక్కుపెట్టడం నుంచి జిలిటెన్ స్టిక్స్‌తో దాడులు చేయడం వరకు నేర్పింది ఆనాటి ఉమ్మడి ఖమ్మం జిల్లా.. నేటి భద్రాద్రి జిల్లానే. కానీ ఈ చారిత్రక అంశాలు అంతగా ప్రాచుర్యంలోకి రాలేదు. దీంతో సాయుధ రైతాంగ పోరాటంలో జిల్లా పాత్ర ఈనాటి ప్రజానీకానికి ఎక్కువగా తెలియకుండా పోయింది. ఆనాటి వివరాలను 'సాక్షి' వెలికి తీసే ప్రయత్నంలో వెలుగుచూసిన అంశాలపై నేటి నుంచి ప్రత్యేక కథనాలు..

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం



సాయుధ పోరాటంలో ప్రత్యేకం.. ఉమ్మడి ఖమ్మం
- నిజాం రాజ్యంలో రైతులపై పెచ్చరిల్లిన దొరస్వామ్యం
- జమీందార్ల ఆగడాలకు వ్యతిరేకంగా మొదలైన పోరాటం
- పేరంటాలపల్లిలో విప్లవకారులకు సాయుధ శిక్షణ

పోరాట నేపథ్యం
భారత దేశంలో ఓ వైపు బ్రిటిష్ సామ్రాజ్యం కొనసాగుతుంటే వారి సహకారంతో నిజాం రాజులు హైదరాబాద్ స్టేట్‌లో పాలన సాగించారు. రాష్ట్ర సాగుభూమిలో దాదాపు నాలుగో వంతుకు పైగా జమీందార్లు, దేశ్‌ముఖ్‌ల చేతుల్లో ఉండేది. సాధారణ రైతులు ఈ జమీందార్ల భూముల్లో సాగు చేసిన తర్వాతే తమ సొంత పొలాలను దున్నుకోవాల్సి వచ్చేది. చేతి వృత్తుల వారు ఉచితంగా అన్ని రకాల సేవలు చేయాల్సి వచ్చేది. సామాన్యులు రేయింబవళ్లు గొడ్డు చాకిరీ చేసినా నోట్లోకి నాలుగు వేళ్లు పోయేవి కాదు.

మరోవైపు భారత స్వాతంత్ర్య సమరంలో అగ్రభాగాన ఉన్న కాంగ్రెస్.. స్వదేశీ సంస్థానాల విషయంలో జోక్యం చేసుకోకూడదనే నిర్ణయం కారణంగా నైజాం రాజ్యంలోని ప్రజల కడగండ్లపై పెద్దగా దృష్టి పెట్టలేదు. ఫలితంగా ప్రభుత్వంపై ప్రజల్లో పెల్లుబికే ఆగ్రహ జ్వాలలను ఒడిసిపట్టుకునే రాజకీయ పరిస్థితులు లేవు. నిజాం రాజ్యంలో తెలుగును అధికార భాషగా మార్చాలనే నినాదంతో ఆంధ్ర మహాసభ పేరుతో కమ్యూనిస్టులు ముందుకొచ్చారు. దున్నే వాడిదే భూమి నినాదంతో ప్రజల్లో నమ్మకం పొందారు. ప్రజలను సమీకరించి దొరల పెత్తనానికి సవాల్ విసిరారు. అలా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం 1946 జూన్ 4న మొదలైంది.

1

ఉమ్మడి జిల్లాలో..
ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆంధ్రా ప్రాంతానికి దగ్గరగా ఉండడంతో కమ్యూనిస్టుల ప్రభావం ఈ జిల్లాపై ఎక్కువగా పడింది. మధిర, ఇల్లెందు వంటి పట్టణాలే కాక పాల్వంచ, కల్లూరు, అశ్వారావుపేట సంస్థానాల్లో వేలాది ఎకరాలు కలిగిన భూస్వాములకు వ్యతిరేకంగా ఉద్యమాలు మొదలయ్యాయి. కార్మికులు సంఘాలను ఏర్పాటు చేసుకుని నిజాం నిరంకుశ విధానాలకు ఎదురుతిరిగారు. మరోవైపు రోజురోజుకూ గ్రామీణ ప్రాంతాల్లో కమ్యూనిస్టుల ప్రభావం పెరిగిపోతుండడంతో అడ్డుకట్ట వేసేందుకు కాశీం రజ్వీ నేతృత్వంలో రజాకార్ల పేరుతో ప్రత్యేక సేనలు గ్రామాల్లో అడుగు పెట్టాయి. దీంతో కమ్యూనిస్టు విప్లవకారులు, రజాకార్ల మధ్య జిల్లాలోని అనేక గ్రామాల్లో పోరాటాలు జరిగాయి.

ఫలించిన 'అల్లూరి' శిక్షణ..
భద్రాచలం నుంచి విశాఖపట్నం మధ్య ఉన్న తూర్పు కనుమల్లో అల్లూరి సీతారామరాజు నిర్వహించిన గెరిల్లా పోరాటం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులను ఆకర్షించింది. దీంతో భద్రాచలం ఏజెన్సీలోని వరరామచంద్రాపురం(వీఆర్ పురం) మండలం పేరంటాలపల్లిలో అల్లూరి సీతారామరాజు సమకాలికుడు, ఉద్యమ సహచరుడిగా పేరున్న సింగరాజు సాధువు వద్దకు శిక్షణ కోసం విప్లవకారులు వెళ్లారు. అక్కడ సుమారు 200 మంది గెరిల్లా యుద్ధతంత్రంలో శిక్షణ తీసుకుని తిరిగి పోరు భూమికి వచ్చారు. మరోవైపు ఇల్లెందు, కొత్తగూడెం బొగ్గు గనుల్లో ఉపయోగించే పేలుడు పదార్థాల గిడ్డంగులపై విప్లవకారులు దాడులు చేశారు. ఇక్కడి నుంచి ఎత్తుకెళ్లిన బాంబులనే ఆ తర్వాత సైనిక వాహనాలు పేల్చివేయడానికి, నిజాం పోలీసు క్యాంపులపై దాడులు చేయడానికి ఉపయోగించారు. ఈ క్రమంలో భద్రాద్రి జిల్లాలో ప్రత్యేక కోయ దళాలు వెలిశాయి. దీంతో నిజాం రజాకార్లపై శిక్షణ పొందిన విప్లవకారుల పోరాటానికి జిల్లా వేదికగా మారింది.

కిన్నెరసానిలో జలవిహారం


జలాశయంలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు తరలివచ్చారు. డ్యామ్, జలాశయం, డీర్ పార్కులను వీక్షించారు. ప్రకృతి అందాల నడుమ సరదాగా గడిపారు. 526 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.28,780 ఆదాయం లభించింది. 230 మంది బోటు షికారు చేయగా టూరిజం కార్పొరేషన్‌కు రూ.13,900 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

కిన్నెరసాని ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తివేత
పాల్వంచరూరల్: ఎగువ ప్రాంతాల నుంచి కిన్నెరసాని జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువ నుంచి 1700 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్ట్‌లోకి చేరుతుండగా, రెండు గేట్లు ఎత్తిఉంచి 8 వేల క్యూసెక్కుల నీటిని దిగువన గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ పూరిస్థాయి నీటిమట్టం 407 అడుగులు కాగా, ఆదివారం 405.50 అడుగులుగా నమోదైంది.

ఓసీల్లోని నీటిని ఎత్తిపోయాలి

సింగరేణి డైరెక్టర్ కొప్పుల వెంకటేశ్వర్లు


ఓసీల్లోకి వరద నీరు చేరిన ప్రదేశాన్ని మ్యాప్ ద్వారా పరిశీలిస్తున్న అధికారులు

మణుగూరు టౌన్: వర్షాల వల్ల ఉపరితల గనుల్లోకి చేరే నీటిని వీలైనంత త్వరగా బయటకు ఎత్తిపోయాలని, బొగ్గు ఉత్పత్తికి ఆటంకాలను నివారించాలని డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మణుగూరు ఏరియాలో పర్యటించిన ఆయన ఓఎన్‌జీసీ డైరెక్టర్ ఆఫ్ జనరల్ సునీల్‌కుమార్, జనరల్ మేనేజర్ ఎస్ఎస్ మాయల్ కిరణ్‌లతో కలిసి పగిడేరు జియోథర్మల్ విద్యుత్ ప్లాంట్‌ను సందర్శించారు. 20 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెంపునకు అవకాశాలు పరిశీలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం వ్యూ పాయింట్ నుంచి పీకేఓసీ-2లో వరద నీరు చేరిన ప్రదేశాన్ని మ్యాప్ ద్వారా పరిశీలించారు. నిలిచిన నీటిని బయటకు పంపే విధంగా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జీఎంలు దుర్గం రాంచందర్, కనకయ్య, శ్రీనివాస్, ఇతర అధికారులు పంకజ్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, శ్రీనివాస్, వీరభద్రరావు, శ్రీనివాసచారి, కనకయ్య, బీఎస్ రావు, వీరభద్రుడు, సురేశ్, శ్రీనివాస్, దయాకర్, బబుల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి విశేష పూజలు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి ఆదివారం జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. క్యూలైన్ ద్వారా భక్తులు అమ్మవారిని దర్శించుకోగా, అర్చకులు విశేష పూజలు జరిపారు. భక్తులు అన్నప్రాసనలు, ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ చైర్మన్ బి.నాగేశ్వరరావు, వేదపండితుడు పద్మనాభశర్మ, అర్చకుడు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

నేడు గిరిజన దర్బార్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే దర్బార్‌లో గిరిజనులు తమ సమస్యలపై అర్జీలను అందజేయాలని పీఓ పేర్కొన్నారు.

'విత్తనం నుంచి మహావృక్షంగా' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు, కవులు

ఖమ్మంగాంధీచౌక్: పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య జీవిత చరిత్రపై రచయిత నరేష్ రాసిన 'విత్తనం నుండి మహావృక్షంగా వనజీవి జీవితం' పుస్తకాన్ని స్థానిక ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో పలువురు రచయితలు, కవులు ఆదివారం ఆవిష్కరించారు. అక్షరాల తోవ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో దాసరోజు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సామాజికవేత్త డాక్టర్ కడవెండి వేణుగోపాల్, కవులు, రచయితలు, సాహితీవేత్తలు సీతారాం, అట్లూరి వెంకటరమణ, సైదులు, ఐనాల నయీమ్ పాషా, వురిమళ్ల సునంద, వనజీవి రామయ్య సతీమణి జానకమ్మ, నామా పురుషోత్తం, రాచమళ్ల ఉపేందర్, సయ్యద్ షఫీ, కన్నెగంటి వెంకటయ్య, రమణ, బ్రహ్మం, నాగమోహన్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కు చెదరలే..

- దుమ్ముగూడెం ఆనకట్ట నిర్మించి 160 ఏళ్లు
- నిర్మాణంలో బ్రిటీష్ ఇంజనీర్ సర్ ఆర్థర్ కాటన్ ప్రతిభ

నేడు ఇంజనీర్స్ డే


దుమ్ముగూడెం ఆనకట్ట

అశ్వాపురం/భద్రాచలంటౌన్: దుమ్ముగూడెం ఆనకట్ట, కిన్నెరసాని ప్రాజెక్ట్ ఇంజనీరింగ్ ప్రతిభకు దర్పణం పడుతున్నాయి. ఏ స్థాయిలో వరదలు వచ్చినా తట్టుకోగలుగుతున్నాయి. సోమవారం ఇంజనీర్స్ డే సందర్భంగా ఆ ప్రాజెక్ట్‌ల నిర్మాణం గురించి తెలుసుకుందాం. గోదావరి నదిపై 160 ఏళ్ల క్రితం 1865లో సర్ ఆర్థర్ కాటన్ దుమ్ముగూడెం ఆనకట్టను రాతి కట్టడంతో నిర్మించారు. 160 ఏళ్లు గడిచినా చెక్కు చెదరలేదు. గోదావరికి పలుమార్లు వరదలు వచ్చినా దెబ్బతినలేదు. ఆనకట్ట ఆధారంగా మణుగూరు భారజల కర్మాగారం నిర్మించగా గోదావరి నుంచి నీరు సేకరించి భార జలం ఉత్పత్తి చేస్తున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ రాజీవ్‌సాగర్ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేసి పనులు చేపట్టగా బీఆర్ఎస్ ప్రభుత్వం రీడిజైన్ చేసి సీతారామ ప్రాజెక్ట్‌గా మార్చి పనులు చేపట్టింది. సీతమ్మ సాగర్ నిర్మాణం సైతం చేపడుతోంది. ఇక్కడి నుంచే జిల్లా వ్యాప్తంగా గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందిస్తున్నారు. ఆనకట్ట వర్షాకాలంలో నీరు ఉప్పొంగుతూ, శీతాకాలంలో నీరు జాలువారుతూ, వేసవికాలంలో అశ్వాపురం, దుమ్ముగూడెం మండలాలకు వారధిగా మూడు కాలాల్లో ఒక్కో అందంతో పర్యాటకులను ఆకట్టుకుంటోంది.

జల రవాణా కోసం..
జల రవాణాను అభివృద్ధి చేసే క్రమంలో బ్రిటీష్ ఇండియా ఆనకట్ట నిర్మాణం చేపట్టింది. నదిలో జల ప్రవాహం తక్కువగా ఉన్న సమయంలో కూడా రవాణా ఆగకుండా నిత్యం నీరు ప్రవహించే విధంగా దుమ్ముగూడెం నిర్మాణం చేపట్టారు. గోదావరి నది మధ్యలో ఉండే లంకకు ఇరువైపులా రెండు ఆనకట్టలు నిర్మించారు. మొదటి దుమ్ముగూడెం లంక, అశ్వాపురం మండలం కుమ్మరిగూడెం మధ్య, రెండో లంకకు దుమ్ముగూడేనికి మధ్య ఉన్నాయి. ఇక్కడి నుంచి రాజమండ్రి వరకు లాంచీల ద్వారా వాణిజ్య రవాణా సాగేది. నిర్మాణంలో కాటన్ ఇంజనీరింగ్ ప్రతిభ చూపాడు. కోడి గుడ్డు సొన, సున్నం, బంకమట్టిని పశువులతో గానుగ ఆడించి ఆ మిశ్రమంతో రాళ్లను పేర్చి ఆనకట్ట నిర్మించారు. అప్పటి నుంచి జిల్లా ప్రజలకు తాగు, సాగునీటి, పారిశ్రామిక వనరుగా మారింది.

వందేళ్లు పటిష్టంగా ఉండేలా..


కిన్నెరసాని ప్రాజెక్ట్

1962లో కిన్నెరసాని ప్రాజెక్ట్ నిర్మాణం

పాల్వంచరూరల్: రెండు గుట్టల మధ్య నిర్మించిన కిన్నెరసాని ప్రాజెక్ట్ నాటి ఇంజనీర్ల ప్రతిభకు దర్పణం పడుతోంది. సరైన వాహనాలు, యంత్రాలులేని కాలంలో పటిష్ట కట్టడం నిర్మించారు. ఏపీఎస్ఈబీ (ప్రస్తుతం జెన్‌కో) సంస్థ రూ.5.58 కోట్లతో కిన్నెరసాని గ్రామ సమీపంలో కిన్నెరసాని నదిపై ప్రాజెక్ట్ నిర్మించింది. 1962 నుంచి 1972 వరకు నిర్మాణ పనులు చేపట్టారు. నాటి ఇరిగేషన్ శాఖ కార్యనిర్వహణ ఇంజనీర్ రామకృష్ణరాజు నేతృత్వంలో పది మంది ఇంజనీర్లు కలిసి 13 క్రస్ట్ గేట్లతో రెండు దశల్లో ప్రాజెక్టు నిర్మాణ పనులను పూర్తిచేశారు. స్కాపర్లు, ఎడ్లబండ్లను వినియోగించి స్థానికంగా లభించిన రాళ్లు, ఇసుక, తోగ్గూడెం నుంచి కంకరను తీసుకొచ్చి నిర్మాణం జరిపారు. ఇందు కోసం పదేళ్లపాటు ఐదువేల మంది కార్మికులు పనులు నిర్వహించారు. బరువులు మోసేందుకు గాడిదలను వినియోగించినట్లు చుట్టుపక్కల ప్రజలు చెబుతున్నారు. రాష్ట్ర నలుమూలల విద్యుత్ పంచే పాల్వంచలోని కేటీపీఎస్‌కు కిన్నెరసాని ద్వారానే నీరు అందుతోంది. ఎన్ఎండీసీ, నవభారత్ పరిశ్రమలకు, 10 వేల ఎకరాలకు సాగు నీరు, కొత్తగూడెం కార్పొరేషన్‌కు తాగునీరు అందిస్తోంది. ఆరు దశబ్దాలు గడిచినా, రిజర్వాయర్‌కు ఎన్నోమార్లు వరద పోటెత్తినా ప్రాజెక్ట్ పటిష్టత దెబ్బతినలేదు.

అప్పటి ఇంజనీర్ల పనితీరు అద్భుతం



కిన్నెరసాని ప్రాజెక్ట్ రూపకల్పన, కట్టినతీరు నేటి ఇంజనీర్లకు ఆదర్శనీయం. సౌకర్యాలు అందుబాటులోలేని రోజుల్లో వందేళ్ల వరకు ఏ సమస్యా రాకుండా నిర్మించారు. ప్రాజెక్టు గేట్ల కింద స్లూయిస్‌ను పటిష్టంగా నిర్మించారు. నిర్మాణం ఎంతో శ్రమతో కూడుకున్నది. అప్పటి ఇంజనీర్ల పనితీరు అద్భుతంగా ఉంది.

–బి.అర్జున్, జలవనరులశాఖ ఈఈ

ఇల్లెందులో 120 ఏళ్ల భవనాలు



120 ఏళ్ల క్రితం నిర్మించిన మిషన్ స్కూల్ భవనం

ఇల్లెందు: సుమారు 120 ఏళ్ల క్రితం ఇల్లెందు ప్రాంతంలో బొగ్గు నిక్షేపాల అన్వేషణ జరిగింది. ఆ సమయంలో బ్రిటీష్ అధికారుల కోసం నిర్మించిన భవనాలు ఇప్పటికీ పటిష్టంగా ఉన్నాయి. నాటి ఇంజనీర్ల మేధస్సుతో నిర్మించిన కట్టడాల్లో ఇప్పుడు ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. ఇల్లెందు చెరువు నుంచి నీటిని ఫిల్టర్ బెడ్ వరకు మోటారు లేకుండా నేరుగా చెరువులోకి తరలించేందుకు సైఫన్ నిర్మాణం చేపట్టారు. అర కిలోమీటర్ దూరంలో ఉన్న ఫిల్టర్ బెడ్ వరకు చెరువు నుంచి సుమారు 5 ఫీట్ల లోపల పైపులైన్ ఏర్పాటు చేసి చెరువులో ఓ సైఫన్‌తో అనుసంధానం చేశారు. సైఫన్ ద్వారా నీరు పైపులైన్‌లోకి చేరి ఫిల్టర్ బెడ్‌కు చేరేలా నిర్మించారు. నేటికీ ఆ సైఫన్ చెక్కు చెదరలేదు. నాడు రెవ. సీబీ వార్డ్ కోసం నిర్మించిన భవనంలో ప్రస్తుతం మిషన్ స్కూల్ కొనసాగుతోంది. నాడు ఏరియా కాలరీ మేనేజర్‌లు నివాసం ఉన్న భవనాల్లో సీఎస్ఐ చర్చి, కోర్టు, సింగరేణి సూపర్ బజార్ ఏర్పాటు చేశారు. మెయిన్‌రోడ్డు పాఠశాల, ఎంపీడీఓ ఆఫీస్, ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్, పోస్టాఫీసు భవనాలు బ్రిటీష్ కాలంలోనే నిర్మించినవే.

డంగు సున్నంతో నిర్మించారు



పురాతన కాలంలో డంగు సున్నంతో, 24 ఇంచుల గోడలతో భవనాల నిర్మాణం చేశారు. బలంగా ఉండేందుకు ఐరన్ దూలాల మీద స్లాబ్ నిర్మాణం చేసేవారు. అప్పటి ఇంజనీర్లంతా మన్నికకు ప్రాధాన్యత ఇచ్చారు. నూటికి నూరుశాతం నిధులు సక్రమంగా వినియోగిస్తే ఇప్పుడైనా మన్నిక కలిగిన భవనాలు నిర్మించవచ్చు.

–రామకృష్ణ, డీఈ, పంచాయతీ రాజ్ విభాగం

కొనుగోళ్లలో కొత్త రూల్..

- సీసీఐకి పత్తి విక్రయించాలంటే స్లాట్ బుకింగ్ తప్పనిసరి
- అందుకోసం 'కాపాస్ కిసాన్' యాప్ ఏర్పాటు
- పత్తి దిగుబడి గుర్తించేందుకు జిల్లా కమిటీలు
- ఉమ్మడి జిల్లాలో 14 జిన్నింగ్ మిల్లులు


గత ఏడాది ఓ మిల్లు వద్ద పత్తి తేమ శాతం పరీక్షిస్తున్న అధికారులు

ఖమ్మంవ్యవసాయం: పత్తికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రైతులు పొందేందుకు సీసీఐ ఈ ఏడాది కొత్త నిబంధన విధించింది. రైతులకే మద్దతు ధర దక్కేలా నిబంధనలు కఠినం చేస్తోంది. సీసీఐ కేంద్రాల్లో పత్తి విక్రయాలకు 'కాపాస్ కిసాన్' యాప్ రూపొందించింది. పంట సాగు చేసిన రైతులు ఈ యాప్‌లో వివరాలు నమోదు చేస్తే.. సాగు చేసినవారే సీసీఐ కేంద్రంలో పత్తి విక్రయించే అవకాశం ఉంటుంది. రైతుల ఆధార్‌కు బ్యాంకు ఖాతా అనుసంధానమై ఉండాలి. ఉమ్మడి జిల్లాలోని 9 వ్యవసాయ మార్కెట్ల పరిధిలో 14 జిన్నింగ్ మిల్లుల ద్వారా పత్తి కొనుగోళ్ల నిర్వహించేలా ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. పత్తి దిగుబడులను గుర్తించేందుకు జిల్లాల వారీగా కమిటీలు ఏర్పాటు చేయనుంది.

యాప్ ద్వారా వివరాల నమోదు

సీసీఐ కేంద్రాల్లో పత్తి విక్రయానికి 'కాపాస్ కిసాన్' యాప్‌లో రైతులు తాము సాగుచేసిన పంట వివరా లు నమోదు చేస్తే.. బుకింగ్ నంబర్ జారీ చేస్తారు. దీని ఆధారంగా స్లాట్ బుక్ చేసుకోవాలి. స్మార్ట్ ఫోన్ ఉన్న వారు లేదా వ్యవసాయ అధికారులు, జిన్నింగ్ మిల్లుల వద్ద ఉన్న మార్కెటింగ్ అధికారుల ద్వారా స్లాట్ బుక్ చేయాలి. నిర్దేశించిన సమయంలో రైతులు పత్తిని జిన్నింగ్ మిల్లుకు తగిన ప్రమాణాలతో తీసుకెళ్లి విక్రయించుకోవచ్చు.

4.46 లక్షల ఎకరాల్లో సాగు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈ ఏడాది 4,46,958 ఎకరాల్లో పత్తిసాగుచేశారు. ఖమ్మంలో 2,25,613, భద్రాద్రిలో 2,21,345 ఎకరాల్లో పత్తి సాగైంది. ఖమ్మం జిల్లాలో 27,07,356 క్వింటాళ్లు, భద్రాద్రి జిల్లాలో 22,13,450 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. 8 నుంచి 12 వరకు తేమ శాతం కలిగిన పంటను మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తుంది. గతేడాది 8 శాతం తేమ కలిగిన పత్తికి క్వింటాకు రూ.7,521 ఇవ్వగా, ఈ ఏడాది రూ.8,110గా (రూ.589 పెరిగింది) నిర్ణయించింది. పంటను లూజ్‌గా విక్రయానికి తీసుకురావాలి.

జిల్లా కమిటీలకు బాధ్యత

పత్తి దిగుబడులను గుర్తించేందుకు జిల్లాల వారీగా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రభుత్వం కమిటీలను ఏర్పా టు చేయనుంది. వాతావరణం, నేలలు తదితర అంశాలను ప్రామాణికంగా తీసుకొని పత్తి దిగుబడులను ఈ కమిటీలు గుర్తిస్తాయి. వర్షాధారంగా పత్తి ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. నీటి ఆధారంగా 18 నుంచి 20 క్వింటాళ్ల వరకు వస్తుంది. జిల్లా కమిటీలు నిర్ణయించిన దిగుబడి ఆధారంగా రైతులు పంట విక్రయించుకోవాలి.

తాత్కాలిక రిజిస్ట్రేషన్లపై నిబంధనల్లో మార్పులు

కౌలు రైతులు పంట విక్రయించేందుకు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం తాత్కాలిక రిజిస్ట్రేషన్ల సౌక ర్యం కల్పించింది. అయితే, గతేడాది ఈ సౌకర్యాన్ని వినియోగించుకుని దళారులు రైతులకు చెందాల్సిన మద్దతు ధరను కొల్లగొట్టారు. అధికారులూ సహకరించి అడ్డంగా దొరికిపోయి రాష్ట్రవ్యాప్తంగా సస్పెండ్ అయ్యారు. దీంతో ఈ ప్రక్రియలో వ్యవసాయ శాఖ అధికారుల అనుమతులు ఉంటేనే తాత్కాలిక రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించే విధంగా నిబంధనలు మార్చారు.

తేమశాతం ఆధారంగా నిర్ణయించిన పత్తి ధర (రూ.లలో)

తేమశాతం	మద్దతు ధర
8 శాతం	8,110
9 శాతం	8,029
10 శాతం	7,948
11 శాతం	7,867
12 శాతం	7,786

కాగా, అక్టోబర్ నుంచి కొను గోళ్లు ప్రారంభించే అవకాశం ఉంది.

ఖమ్మం జిల్లాలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు

- జీఆర్ఆర్ ఇండస్ట్రీస్ వెంకటగిరి ఖమ్మం రూరల్.
- శ్రీసాయి బాలాజీ జిన్నింగ్ అండ్ ఆయిల్ మిల్, తల్లంపాటు ఖమ్మం రూరల్.
- అమరావతి టెక్స్‌టైల్స్ దెందుకూరు, మధిర.
- మంజీత్ కాటన్ మిల్ మాటూరు, మధిర.
- శ్రీ శివగణేశ్ కాటన్ ఇండస్ట్రీస్ ఇల్లెందులపాడు, మధిర.
- ఉషశ్రీ కాటన్, జిన్నింగ్ మిల్స్, సువర్ణాపురం, ముదిగొండ.
- స్టాప్లరిచ్ జిన్నింగ్ ఇండస్ట్రీస్, తల్లాడ.
- జీఆర్ఆఆర్ జిన్నింగ్ మిల్స్, పాన్నెకల్, ఖమ్మంరూరల్.
- శ్రీ భాగ్యలక్ష్మి కాటన్ ఇండస్ట్రీస్, గోల్‌తండా, తిరుమలాయపాలెం.

భద్రాద్రి జిల్లాలో సీసీఐ కేంద్రాలు

- లక్ష్మీప్రియ జిన్నింగ్ మిల్, కారేపల్లి.
- మంజితజిన్నింగ్ మిల్స్, కొత్తగూడెం.
- అనూశ్రీ జిన్నింగ్ మిల్, బూర్గంపాడు.
- శ్రీ లక్ష్మీనరసింహ జిన్నింగ్ మిల్, బూర్గంపాడు.
- శ్రీరామా జిన్నింగ్ మిల్స్, అశ్వాపురం.

మద్దతు ధర కోసం చర్యలు



కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రైతులకు దక్కే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పంట విక్రయంలో కూడా రైతులు ఇబ్బందులు పడకుండా స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ ప్రక్రియ రైతులకు ఎంతో మేలైంది. నిర్దేశించిన సీసీఐ కేంద్రాల ద్వారా పత్తి కొనుగోళ్లకు పటిష్ట చర్యలు చేపడుతున్నాం.

–ఎంఏ అలీం,
జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, ఖమ్మం

క్లుప్తంగా

సామాన్యులకు కమ్యూనిస్టులే అండ..


దొండపాటి వెంకయ్య స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

కొణిజర్ల: నాటి నిజాం పాలన, నేటి బూర్జువా పార్టీల పాలనలో సామాన్యులకు అండగా నిలిచి పోరాటాలు చేస్తున్నది కమ్యూనిస్టులే అని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు స్పష్టం చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని తనికెళ్లలో గడల సీతారామయ్య, కొణిజర్లలో దొండపాటి వెంకయ్య స్మారక స్తూపాల వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చరిత్రను ఎవరూ వక్రీకరించలేరని, రజాకార్లకు ఎదురొడ్డి ప్రాణాలు సైతం లెక్క చేయకుండా పోరాడారని తెలిపారు. కేంద్రంలోని ప్రభుత్వం నాటి నిజాం పాలకులను గుర్తు చేస్తూ మతాల మధ్య చిచ్చుపెట్టి అధికారంలో కొనసాగాలని చూస్తోందని ఆరోపించారు. అనంతరం సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు యర్రా బాబు, దొండపాటి రమేష్, పోటు కళావతి, మండల కార్యదర్శి గడల భాస్కరరావు, సహాయ కార్యదర్శులు స్వర్ణ రమేశ్, మణిగె కోటేశ్వరరావు, నాయకులు గడల సీతారామయ్య, తోటపల్లి సీతారాములు, సోమయ్య, గోపాల్‌రావు, విష్ణుమూర్తి, రామయ్య, రాంబాబు, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

'రాజీవ్ స్వగృహ' వేలానికి నిర్ణయం


మాట్లాడుతున్న ఏలూరి శ్రీనివాసరావు

ఖమ్మంరూరల్ : గృహ నిర్మాణ శాఖ ప్రతిపాదన, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలేపల్లిలోని రాజీవ్ స్వగృహ బహుళ అంతస్తుల భవనాల బహిరంగ వేలం నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు టీజీటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ స్వగృహ భవన సముదాయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇందులో ఫ్లాట్‌లు కొన్నవారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా, మున్నేరు వరద ఇటు వైపు రాకుండా రిటైనింగ్‌వాల్ నిర్మిస్తున్నారని, కొనుగోలుదారులు అపోహ పడొద్దని సూచించారు. ఏదులాపురం మున్సిపాలిటీ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నందున ప్రభుత్వ ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బహుళ అంతస్తుల భవనాల్లో ఎనిమిది బ్లాక్‌లు, తొమ్మిది ఫ్లోర్లు, ఒక్కో ఫ్లోరుకు ఎనిమిది ఫ్లాట్లు ఉన్నాయని వివరించారు.

శతాధిక వృద్ధురాలు మృతి


గొట్టుపర్తి రంగమ్మ (ఫైల్)

కామేపల్లి: కామపల్లి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు గొట్టుపర్తి రంగమ్మ(101) శనివారం రాత్రి మృతి చెందారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త అవధూతేంద్ర భక్తమండలి అధ్యక్షుడు గొట్టుపర్తి శివాజీ, నాగభూషణరావు ఆమె కుమారులు. వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ డైరెక్టర్ రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, కొండాయిగూడెం పీఏసీఎస్ చైర్మన్ ధనియాకుల హన్మంతరావు, మద్దినేని రమేశ్‌బాబు, కొమ్మినేని శ్రీనివాసరావు తదితరులు నివాళులర్పించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని బోదులబండకు చెందిన మహేశ్ (25) ఆదివారం పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

వ్యభిచారం నిర్వహిస్తున్న ఇంటిపై దాడి

బోనకల్: మండలంలోని చిరునోముల గ్రామంలో వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ ఇంటిపై టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు సంయుక్తంగా ఆదివారం దాడిచేశారు. ఒక విటుడు, బాధితురాలితోపాటు దందా నిర్వహిస్తున్న మహిళను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పొదిలి వెంకన్న తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,107

ముగిసిన వెయిట్ లిఫ్టింగ్ టోర్నీ


విజేతలకు బహుమతులు అందజేస్తున్న మల్లు నందిని

ఖమ్మంస్పోర్ట్స్: జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యాన నగరంలో సర్దార్ పటేల్ స్టేడియంలోని జిమ్నాజియం హాల్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి మహిళల ఖేలో ఇండియా వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి డిప్యూటీ సీఎం సతీమణి నందిని ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

తొలుత జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. అనంతరం పలు కేటగిరిల్లో విజేతలకు ఆమె బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షు డు వి.శ్రుతి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్య దర్శి కె.క్రిష్టోఫర్‌బాబుతో పాటు శివగణేశ్, దొంగల వినోద్‌కుమార్, హనుమంతరాజు, రవి, సుధాకర్, సీహెచ్ నాగరాజు, సిద్ధార్థనాగిరెడ్డి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. కాగా, పోటీలకు రాష్ట్రంలోని నిజామాబాద్, మెదక్, రంగారెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్‌స్కూల్, ఖమ్మం,వరంగల్ తదితర జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

జూనియర్ బాలికల 44 కేజీల విభాగంలో సింధు, బి.గౌతమి, 48 కేజీల కేటగిరిలో శ్రీపాద శ్రీజ, ఎం.సహస్ర, బి.అలేఖ్య, 53 కేజీల కేటగిరిలో ఎ.త్రోనీ, పి.అర్చన, వై.అంజలి, 58 కేజీల విభాగంలో ఎం.స్వాతి, జి.శ్రుతి, ఎ.వర్షిత, 63 కేజీల కేటగిరిలో టి.ఆర్చన, కె.స్వాతి, ఎం.గౌరీ, 69 కేజీల కేటగిరిలో వి.హరిత, బి.హారిణి, 77 కేజీల విభాగంలో బి.తోషిని, బింధుప్రియ, కీర్తన, 77 కేజీల పైకేటగిరిలో వి.సహస్ర, లిబికా, మహేశ్వరీ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నారు.

మహిళను వేధించిన వ్యక్తిపై కేసు

ఖమ్మంఅర్బన్: కుటుంబ గొడవల నేపథ్యంలో ఓ మహిళపై వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై ఖమ్మం అర్బన్ (ఖానాపురం హవేలి) పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. ఎస్ఐ శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. నగరంలోని 1వ డివిజన్ కైకొండాయిగూడెంకు చెందిన తేజావత్ వినోద్ ఓ మహిళను వేధిస్తున్నాడు. కొడవలి పట్టుకుని వెళ్లి ఆమెను చంపుతానని బెదిరించాడు. తర్వాత వినోద్ కుటుంబ సభ్యులు సుజాత, హుస్సేన్, మంగమ్మ బాధిత మహిళ ఇంటి వద్దకు వచ్చి దుర్భాషలాడుతూ, చంపుతామని బెదిరించినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మందుబాబులకు ఇక పండుగే !

- హోటళ్లు, రెస్టారెంట్లలోనూ బీర్ల విక్రయం
- ఖమ్మం కార్పొరేషన్‌లో మైక్రో బ్రూవరీ యూనిట్ల ఏర్పాటుకు లైసెన్స్‌లు
- ఈనెల 25 వరకు దరఖాస్తుల స్వీకరణ



ఖమ్మంక్రైం: మందుబాబులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త ప్రకటించింది. ఇప్పటివరకు బార్‌లు, వైన్‌షాపుల్లో మాత్రమే లభ్యమయ్యే బీర్లు ఇక హోటళ్లు, రెస్టారెంట్లలోనూ అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని నగరాల్లో మైక్రో బ్రూవరీ యూనిట్ల ఏర్పాటుకు లైసెన్స్‌లు మంజూరు చేస్తూ సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. మైక్రో బ్రూవరీ ఏర్పాటుకు ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించింది.

యూనిట్ ఏర్పాటు చేయాలంటే..

మైక్రో బ్రూవరీస్ యూనిట్ ఏర్పాటుకు 1000 చదరపు మీటర్ల విస్తీర్ణం కలిగిన ప్రాంగణం కావాలి. ఈ యూనిట్లను రెస్టారెంట్లు, ఎలైట్ బార్లు, సీ1 క్లబ్, టీడీ1, టీ2 లాంటి లైసెన్స్ కలిగిన ప్రాంగణాల్లో ఏర్పాటు చేసుకోవచ్చు. 21 ఏళ్ల కంటే తక్కువ వయసున్నవారు, డ్రగ్స్, కల్తీ మద్యం, గంజాయి విక్రయాల కేసుల్లో ఉన్నవారికి బ్రూవరీల ఏర్పాటుకు అనుమతి లేదు. మైక్రో బ్రూవరీలో బీర్ల తయారీకి ప్రత్యేకంగా కిచెన్ ఏర్పాటు చేయాలి.

ఇలా దరఖాస్తు చేయాలి..

మైక్రో బ్రూవరీస్ యూనిట్ కోసం దరఖాస్తు చేయాలనుకునేవారు సంబంధిత ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో ఐడీ ప్రూఫ్‌లతో పాటు రూ.లక్ష డీడీ జత చేసి దరఖాస్తులు చేయాలి. ఈనెల 25 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. అయితే మైక్రో బ్రూవరీస్‌లో ఎక్సైజ్ నిబంధనల మేరకు మాత్రమే బీర్లు విక్రయించాలి. పార్కింగ్ కోసం 250 చదరపు మీటర్లు ఉండాలి. బ్రూవరీస్ ఏర్పాటు చేసిన ప్రదేశంలో ఎయిర్ కండిషనర్ ఉండాలి. ఖమ్మంలో ఫ్యామిలీ రెస్టారెంట్లు నడిపే వారు మైక్రో బ్రూవరీస్ ఏర్పాటుకు ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలుస్తోంది.

మైక్రో బ్రూవరీ అంటే..

మైక్రో బ్రూవరీలో అప్పటికప్పుడు వివిధ రకాల బీర్లు తయారు చేసి విక్రయిస్తారు. ప్రస్తుతం బార్లు, వైన్‌షాపుల్లో విక్రయించే వివిధ బ్రాండ్‌లు కాకుండా ప్రత్యేకంగా తయారుచేసిన బీర్లు మాత్రమే బ్రూవరీలో లభ్యమవుతాయి. హైదరాబాద్‌లో వీటికి విపరీతమైన ఆదరణ ఉండడంతో నగరాల్లోనూ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

చెక్‌డ్యాంలో మహిళ మృతదేహం లభ్యం


మృతదేహం వద్ద పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది


పాలడుగుల చెన్నమ్మ (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: వాగు దాటే క్రమంలో వరద ప్రవాహంలో కొట్టుకుపోయిన ఇద్దరు మహి ళా కూలీల్లో ఆదివారం ఒకరి మృతదేహం లభ్య మైంది. కాగా, మరో మహిళ ఆచూకీ ఇంకా దొరకలేదు. మండలంలోని గోపన్నగూడెం - కన్నాయిగూడెం మార్గంలో ఉన్న వాగును ఏపీలోని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం పూచికపాడు గ్రామానికి చెందిన ఏడుగురు కూలీలు దాటుతున్న క్రమంలో పాలడుగల చెన్నమ్మ (60), పచ్చితల వరలక్ష్మి(55) గల్లంతైన సంగతి తెలిసిందే. ఆదివారం తెల్లవారుజాము నుంచే పెదవాగు వెంబడి ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. అనంతారం గ్రామ సమీపంలోని వాగు చెక్ డ్యాం వద్ద చెన్నమ్మ మృతదేహాన్ని గుర్తించిన ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మరో కూలీ వరలక్ష్మి ఆచూకీ కోసం అధికారులు, సిబ్బంది గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. సీఐ నాగరాజు, ఎస్ఐ యయాతిరాజుతో పాటు ఏపీలోని ఏలూరు జిల్లా పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు, జీలుగుమిల్లి సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో గాలిస్తున్నారు.

గోదావరి తీరంలో పాము కలకలం


నదిలో తిరుగుతున్న పాము

భద్రాచలంటౌన్: గోదావరి తీరంలో స్నాన ఘట్టాల వద్ద ఒక పాము కలకలం సృష్టించింది. భక్తులు ఆదివారం ఉదయం గోదావరిలో స్నానాలు ఆచరించేందుకు దిగే క్రమంలో ఒక పాము కనిపించడంతో భయభ్రాంతులకు గురయ్యారు. స్థానికులు వచ్చి పామును దూరంగా తరిమారు. కొండ చిలువ లాగా ఉండడంతో భక్తులు ఆ ప్రదేశంలో స్నానాలు చేసేందుకు భయపడ్డారు.

వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు

ఇల్లెందు: బాధితుడి నుంచి ఫీజు తీసుకుని, హైకోర్టులో కేసు అప్పీల్ చేస్తానంటూ బురిడీ కొట్టించిన వ్యక్తిపై ఇల్లెందు పోలీసులకు ఫిర్యాదు అందింది. పట్టణంలోని సత్యనారాయణపురానికి చెందిన ఎస్‌కే ఫకీర్‌సాహెబ్, తన భార్యకు మధ్య జరిగిన గొడవలపై కొత్తగూడెం కోర్టులో కేసు దాఖలు చేశారు. కాగా, ఫకీర్‌సాహెబ్ తన భార్యకు ప్రతీ నెల రూ.10 వేలు భరణం చెల్లించాలని కోర్టు తీర్పు ఇచ్చింది. ప్రతీ నెలా తన భార్యకు రూ.10 వేలు భరణం చెల్లించే స్తోమత లేదని, హైకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు నిర్ణయించుకున్నాడు. ఇల్లెందు జేకే కాలనీకి చెందిన ఓ లీడర్ ద్వారా ఓ న్యాయవాది పరిచయమై హైకోర్టులో అప్పీల్ చేస్తానని, రూ.10 వేల భరణం తగ్గించేలా చేస్తానని నమ్మబలికాడు. కేసు వాదించేందుకు రూ.35 వేలు ఫీజు తీసుకున్నాడు. నెలలు గడుస్తున్నా ఈ కేసు హైకోర్టులో అప్పీల్ చేయకపోవటం, కొత్తగూడెం కోర్టు నుంచి భరణం చెల్లింపు నోటీసులు వస్తుండటంతో అనుమానం వచ్చిన ఫకీర్‌సాహెబ్ హైకోర్టు బార్ కౌన్సిల్‌ను సంప్రదించాడు. సదరు వ్యక్తి న్యాయవాది కాదని, హైకోర్టు బార్ కౌన్సిల్‌లో తన పేరు లేదని బార్ కౌన్సిల్ నుంచి లిఖితపూర్వకంగా లేఖ ఇచ్చారు. ఈ విషయమై ఫకీర్‌సాహెబ్ ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ టి.సురేశ్‌ను వివరణ కోరగా ఫకీర్‌సాహెబ్ నుంచి ఫిర్యాదు అందిందని, విచారణ చేస్తున్నామని తెలిపారు. పోలీసుల సూచన మేరకు ఇల్లెందు బార్ అసోసియేషన్‌లో కూడా బాధితుడు ఫిర్యాదు చేశాడు.

పేకాటస్థావరంపై దాడి

ఖమ్మంక్రైం: పేకాట స్థావరంపై ఖమ్మం టూటౌన్ పోలీసులు ఆదివారం రాత్రి దాడి చేశారు. బైపాస్‌రోడ్డులోని నూతన బస్టాండ్ సమీపంలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు టూటౌన్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. గుంటూరు చెందిన వ్యక్తితో పాటు ఖమ్మానికి ఆరుగురు పోలీసులకు చిక్కారు. వారి వద్ద నుంచి రూ.45 వేలు స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ముగ్గురిపై కేసు

రఘునాథపాలెం: వ్యవసాయ భూమికి ఫెన్సింగ్ వేస్తుండగా అడ్డుకున్న ముగ్గురిపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని చింతగుర్తికి చెందిన రైతు భరత్ తన భూమికి ఫెన్సింగ్ వేస్తుండగా, అదే గ్రామానికి చెందిన అశోక్, అనిలా, వెంకటేశ్వర్లు అడ్డుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు.

గోశాలను సందర్శించిన శంకర మఠాధిపతి


గోశాలలో మఠాధిపతి, భక్తులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 14వ డివిజన్ గొల్లగూడెం శ్రీకృష్ణ గోశాలను శ్రీ శృంగేరి శంకర మఠాధిపతి స్వామి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా గోమాతలకు ప్రత్యేక పూజలు చేసి, సేవకులను ఆశీర్వదించారు. అనంతరం భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు.

అర్హత కోల్పోయాం.. న్యాయం చేయండి..


మాట్లాడుతున్న విద్యార్థులు

పాల్వంచ: తెలంగాణలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి చదివినప్పటికీ నీట్ 2025–26 కౌన్సెలింగ్‌లో అర్హత కోల్పోయామని, తమకు న్యాయం చేయాలని పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు కోరారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ.. తెలంగాణలో పుట్టి పెరిగిన తాము పక్కనే ఆంధ్రాలో ఇంటర్ చదివామని, ఇటీవల ప్రభుత్వం జీఓ 33 తెచ్చి ఇంటర్ వేరే రాష్ట్రంలో చదివిన వారికి ఇక్కడ సీట్లు కేటాయించబోమని ప్రకటించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో ఎండీ పెరహన, హైమావతి, శివలక్ష్మి, ఎలమర్తి రవిబాబు, శ్రీనివాసరావు, రోహిణి, వషిత, అక్షయ్, మానస, నిమిషా, నోమిత తదితరులు పాల్గొన్నారు.